నమస్తే తెలంగాణ
సిద్దిపేట
15 | హైదరాబాద్, సోమవారం 5 ఫిబ్రవరి 2024 | SIDDIPET

# కాంగ్రెస్‌వి 420 హామీలు..

ఆరు గ్యారెంటీలు అమలు కావు
రైతుభరోసా 15వేలు, 4వేల పింఛన్ అమలు ఎక్కడ..?

- 24 గంటల నుంచి 15గంటలకు వచ్చిన కరెంట్ సరఫరా
- తెలంగాణకు బీఆర్ఎస్ పార్టీయే శ్రీరామరక్ష
- లోక్‌సభ ఎన్నికల్లో మెదక్ నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించుకుందాం
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు
- పటాన్‌చెరులో మెదక్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం
- పెద్ద ఎత్తున హాజరైన నాయకులు, కార్యకర్తలు




పటాన్‌చెరులో మెదక్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

జిన్నారం(పటాన్‌చెరు), ఫిబ్రవరి 4: 'కాంగ్రెస్‌వి 420 హామీలు' అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఆదివారం పటాన్‌చెరులోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో బీఆర్ఎస్ మెదక్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఎమ్మెల్యే హరీశ్‌రావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో జాప్యం చేస్తుందని విమర్శించారు. వచ్చే మెదక్ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు.కార్యకర్తలు ఏం బాధపడొద్దని, ఇది చిన్న స్పీడ్‌బ్రేక్ మాత్రమేనన్నారు. రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ కేవలం ఐదేండ్లు ఉండి ఇంటికిపోయిందని విమర్శించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ 1.8 శాతం అంటే నాలుగున్నర లక్షల ఓట్ల స్వల్ప తేడాతో ప్రభుత్వాన్ని కోల్పోయామన్నారు. నిజం గడపదాటేలోపు అబద్ధం ఊరంతా తిరిగినట్లు కాంగ్రెస్ దుష్ప్రచారం చేసిందన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని అడిగితే డేట్లు చెబుతున్నారని విమర్శించారు. ఫిబ్రవరి 1న గ్రూప్-1 ఉద్యోగాల నోటిఫికేషన్ వేస్తామని, డిసెంబర్ 9 నుంచి కరెంట్ బిల్లులు కట్టొద్దని చెప్పారని ఇప్పటి వరకు అమలు చేయలేదన్నారు. ఇప్పుడైతే రైతుబంధు రూ.10వేలు ఇస్తారు, కాంగ్రెస్ వచ్చిన తర్వాత రూ.15వేలు ఇస్తామని అప్పటి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చెప్పాడని, ప్రభుత్వం వచ్చినా ఇప్పటి వరకు రైతుబంధు ఇవ్వకుండా రైతుల ఉసురు తీస్తున్నారని విమర్శించారు. జనవరిలో ఇవ్వాల్సిన రూ.2వేల పెన్షన్‌ను ఫిబ్రవరిలో ఇచ్చి జనవరి పెన్షన్‌ను ఎగ్గొట్టారన్నారు. రెండు లక్షల రుణమాఫీ అమలు సంగతి కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందన్నారు. మార్పు పేరుతో బస్సుల్లో మహిళలకు ఉచిత సౌకర్యం కల్పించి 6.50లక్షల ఆటో డ్రైవర్లను కాంగ్రెస్ ప్రభుత్వం రోడ్డున పడేసిందన్నారు. ఉపాధి కరువై 12 మంది ఆటో డ్రైవర్లు చనిపోతే ఒక్క మంత్రి కూడా వారి కుటుంబాలను పరామర్శించలేదని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ 24 గంటల కరెంట్ సరఫరా చేస్తే కాంగ్రెస్ ప్రభు త్వం రెండు నెలలకే రోజుకు 15 నుంచి 16గంటల కరెంట్ ఇస్తుందన్నారు. ఎంత ఒత్తిడి తెచ్చినా పదేండ్లలో ప్రాజెక్టులను కేంద్రానికి కేసీఆర్ అప్పజెప్పలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన రెండు నెలలకే ప్రాజెక్టులను కేంద్రానికి అప్పజెప్పిందన్నారు. ఢిల్లీలో కాంగ్రెస్ వస్తేనే ఇచ్చిన హామీలు ఇక్కడ అమలవుతాయని రేవంత్‌రెడ్డి అంటున్నాడని, కాంగ్రెస్‌కు దేశంలో 40 సీట్లు కూడా రావని పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ కూటమి నుంచి వెళ్లిపోయిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లోపు రెండు లక్షల రుణమాఫీ చేస్తే హర్షం వ్యక్తం చేస్తామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో అమీన్‌పూర్, బొల్లారం, తెల్లాపూర్ మున్సిపాలిటీల్లో నీటి సమ స్య పరిష్కరించామన్నారు. ఎంపీ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ గెలిస్తే తెలంగాణకు లాభం లేదని, బీఆర్ఎస్‌ని గెలిస్తేనే ప్రయోజనం చేకూరుతుందన్నారు. మెదక్ ఎంపీగా బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. రాముడు అందరికీ దేవుడని, దీన్ని కూడా రాజకీయం చేస్తూ బీజేపీ ఓట్లు అడుగుతోందని విమర్శించారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి 150 ఆలయాలు కట్టించాడని గుర్తుచేశారు. అనంతరం సమస్యల పరిష్కారానికి ఆటో డ్రైవర్లు హరీశ్‌రావుకు వినతి పత్రం అందజేశారు. మాజీ ఎమ్మెల్సీ వి.భూ పాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మదన్‌రెడ్డి, కే సత్యనారాయణ, జడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్, ఎఫ్‌డీసీ మాజీ వంటేరు ప్రతాప్‌రెడ్డి, గాలి అనిల్‌కుమార్, జడ్పీటీసీ కుమార్ గౌడ్, మాజీ జడ్పీటీసీ కొలనుబాల్‌రెడ్డి, ఆదర్శ్‌రెడ్డి మాట్లాడారు. సమావేశంలో ఎంపీపీలు, జడ్పీటీసీలు, మున్సిపల్ చైర్మన్లు, కార్పొరేటర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన మహిళలు, నాయకులు, కార్యకర్తలు

### మెదక్ ఎంపీ స్థానాన్ని గెలుచుకోవాలి



రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మెదక్ ఎంపీ స్థానాన్ని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలి. గత అసెంబ్లీ ఎన్నికల్లో జరిగిన తప్పిదాలను సరిదిద్దుకొని ఎంపీ ఎన్నికల కోసం నాయకులు, కార్యకర్తలతో కలిసి అందరం పనిచేయాలి. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం చేతగాని హామీలు గుప్పిస్తోంది. మెదక్ ఎంపీ స్థానాన్ని మాజీ ఎమ్మెల్సీ వి.భూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గాలి అనిల్‌కుమార్ ఆశిస్తున్నారు. ఎవరికి టికెట్ ఇచ్చినా వారిని భారీ మెజార్టీతో గెలిపించుకుందాం. ఎంపీ ఎన్నికల్లో సత్తా చాటి స్థానిక ఎన్నికలకు గట్టిపునాదులు వేసుకుందాం. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు ఎవరికీ అన్యాయం జరగదు. ఎవరికి ఏ ఇబ్బందులు వచ్చినా వారి బాధ్యత ఎమ్మెల్యే హరీశ్ అన్న తీసుకుంటాడు.

– గూడెం మహిపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే

### ఎంపీ ఎన్నికలు మనకు చాలా కీలకం



మెదక్ ఎంపీ ఎన్నికలు మనకు చాలా కీలకమైనవి . ఈ ఎన్నికల్లో అందరం సమష్టిగా పనిచేయాలి. ఎంపీ ఎన్నికలను పునాదిగా భావించి స్థానిక ఎన్నికలకు గెలుపు బాటలు వేసుకోవాలి. పదేండ్లలో గులాబీ అధినేత కేసీఆర్ రాష్ట్రంలో వేల కోట్ల అభివృద్ధిపనులు చేయించారు. కాంగ్రెస్ మోస పూరిత హామీలను ప్రజలు చాలా తొందరగా గుర్తించారు. ఆరు గ్యారెంటీల్లో రెండు మాత్రమే అమలు చేసి మిగిలినవి అమలు చేయక కాంగ్రెస్ ప్రభుత్వం ఆపసోపాలు పడుతోంది. ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిస్తేనే ఆరు గ్యారెంటీలు అమలు అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలను మళ్లీ మోసం చేస్తున్నారు. తెలంగాణకు కేసీఆర్ రక్ష అని ప్రజల్లోకి తీసుకెళ్లాలి. అందరం కలిసికట్టుగా మెదక్ ఎంపీ స్థానాన్ని గెలిపించుకుందాం.

– సునీతారెడ్డి, ఎమ్మెల్యే



సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో ఆటోడ్రైవర్ల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

# బతకలేక పోతున్నాం

సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావుతో ఆటో డ్రైవర్ల ఆవేదన

అధైర్యపడకండి.. అసెంబ్లీలో మీకోసం కొట్లాడతాం

ఆటో డ్రైవర్లకు ధైర్యం కల్పించిన హరీశ్‌రావు

జిన్నారం (పటాన్‌చెరు), ఫిబ్రవరి 4: కాంగ్రెస్ ప్రభుత్వంలో బతకలేకపోతున్నామని ఆటో డ్రైవర్లు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యేకు హరీశ్‌రావు ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. పటాన్‌చెరు జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన మెదక్ పార్లమెట్ ఎన్నికల సన్నాహక సమావేశానికి ఎమ్మెల్యేలు మహిపాల్‌రెడ్డి, సునీతారెడ్డితో కలిసి ఆయన వస్తుండగా పటాన్‌చెరు బస్‌స్టాప్ వద్ద రోడ్డుపై ఉన్న ఆటోడ్రైవర్లను చూసి కారు ఆపి వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం వల్ల తమ రోజువారి జీవనం కష్టమైందని, ఆత్మహత్యలు చేసుకునే దుర్భర పరిస్థితులు వచ్చాయని ఆటో డ్రైవర్లు హరీశ్‌రావుకు తెలిపారు. ఎవరూ ఆత్మహత్యలకు పాల్పడొద్దని, రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ఆటో డ్రైవర్ల సమస్యలపై ప్రభుత్వంతో కొట్లాడుతామని ఆటోడ్రైవర్లకు భరోసా ఇచ్చి ధైర్యం కల్పించారు.

# ఏడుపాయల్లో భక్తుల సందడి



మెదక్ జిల్లా ఏడుపాయల్లో పూజలందుకుంటున్న వనదుర్గామాత

పాపన్నపేట, ఫిబ్రవరి 4 : మెదక్ జిల్లాలోని పవిత్ర పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గా భవానీ మాత ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. మంజీరా నదిలోని వివిధ పాయల్లో పుణ్యస్నానాలు ఆచరించి దుర్గామాతను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ చైర్మన్ బాలాగౌడ్, ఈవో మోహన్‌రెడ్డి, సిబ్బంది సూర్య శ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డి, రవివీర్ కుమార్, లక్ష్మీనారాయణ, ప్రతాప్‌రెడ్డి, నర్సింహులు, వరుణాచారి, రాజు, శ్రీకాంత్, సంతోష్, యాదగిరి ఏర్పాట్లు చేశారు. వేద పండితులు శంకర శర్మ, పార్థీవశర్మ, మురళీధర్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పాపన్నపేట ఎస్సై నరేశ్ సిబ్బందితో కలిసి బందోబస్తు నిర్వహించారు.



మెదక్ జిల్లాలో ఏడుపాయల వనదుర్గా భవానీమాత ఆలయ సన్నిధిలో భక్తుల సందడి

## ప్రజలు.. సుఖసంతోషాలతో ఉండాలి

మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే శ్రీనివాస్‌యాదవ్



సిద్దిపేట జిల్లా కొమురవెల్లిలో మాట్లాడుతున్న మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

చేర్యాల, ఫిబ్రవరి 4: సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి మల్లికార్జున స్వామిని ఆదివారం మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చిన్ననాటి నుంచి మల్లన్న దర్శనం కోసం కొమురవెల్లికి వస్తున్నానని, తెలంగాణ ప్రజలు సుఖసంతోషాలతో జీవనం కొనసాగించాలని స్వామివారిని కోరుకున్నట్లు తెలిపారు. ఒకప్పుడు స్వామివారి క్షేత్రంలో గదులు, రోడ్లు, తాగునీటి సమస్య, రవాణా వ్యవస్థ సక్రమంగా లేక భక్తులు అనేక ఇబ్బందులు పడేవారన్నారు. బీఆర్ఎస్ పాలనలో భక్తుల కోసం ఎన్నో వసతులు కల్పించామని, ప్రజల రాక పెరగడంతో పాటు ఆదాయం సైతం పెరిగిందన్నారు. రెండు వారాలుగా లక్షలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారని, తెలంగాణ పల్లెల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి జనం రావడం సంతోషంగా ఉందన్నారు. గుడి దగ్గర రాజకీయాలు చేయవద్దని, దాసారం గుట్టపైన తాను హామీ ఇచ్చిన విధంగా ఆధునిక వసతులతో గెస్ట్‌హౌస్ నిర్మాణం చేపడుతానని, తానేకాకుండా దాతలతో భవనాలు కట్టించేవిధంగా చర్యలు తీసుకుంటానని తెలిపారు.

కొమురవెల్లి ఆలయ రాజగోపురం వద్ద భక్తుల రద్దీ



- మూడో ఆదివారానికి భారీగా భక్తుల రాక
- దర్శించుకుని పులకించిన భక్తజనం
- 'మల్లన్న' నామస్మరణతో మార్మోగిన కొమురవెల్లి
- కోరమీసాల స్వామికి మొక్కుల చెల్లింపు






మల్లన్న సన్నిధిలో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



# శరణు శరణు మల్లన్న

- పెద్ద ఎత్తున బోనాలు సమర్పించిన మహిళలు
- స్వామివారి సన్నిధిలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యేలు తలసాని, పద్మారావు పూజలు

చేర్యాల, ఫిబ్రవరి 4: సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి.స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు మల్లన్నక్షేత్రానికి భారీగా తరలివస్తున్నారు. మల్లన్న దర్శనంతో భక్తులు మంత్ర ముగ్ధులవుతున్నారు. మూడో ఆదివారం స్వామివారి నామస్మరణతో మల్లన్న క్షేత్రం మార్మోగింది. ఆదివారం సందర్భంగా 50వేల మంది భక్తులు మొక్కులు చెల్లించుకున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. మల్లన్నను ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్‌యాదవ్, పద్మారావు కుటుంబ సభ్యులతో దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.స్వామి వారి క్షేత్రానికి వచ్చిన భక్తులు ఆలయ నిర్వహణలో ఉన్న గదులు, ప్రైవేట్ గదులు అద్దెకు తీసుకుని అందులో బసచేస్తున్నారు. శనివారం రాత్రి క్షేత్రానికి చేరుకున్న భక్తులు ఆదివారం వేకువజామున నిద్రలేచి పవిత్ర స్నానం ఆచరించి స్వామివారి దర్శనం కోసం క్యూలో గంటల పాటు వేచి ఉన్నారు. స్వామి వారి దర్శనం అనంతరం గంగరేగుచెట్టు వద్ద ముడుపులు, పట్నం, మరికొందరు తాము బసచేసిన గదుల వద్ద, మహామండపంలో పట్నాలు వేసి మొక్కులు తీర్చుకున్నారు. మరికొందరు గంగరేగుచెట్టు వద్ద ముడుపులు కట్టి మొక్కులు చెల్లించుకోవడంతో పాటు కోరిన కోరికలు తీర్చాలని వేడుకున్నారు. కొందరు భక్తులు అమ్మవార్లకు ఒడి బియ్యం, మల్లన్నకు అభిషేకం,అర్చన తదితర పూజలు నిర్వహించారు. గుట్టపై ఉన్న ఎల్లమ్మకు మహిళలు ఒడి బియ్యం, బోనం సమర్పించుకున్నారు.ఈ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఈవో ఎ.బాలాజీ, ఆలయ పునరుద్ధరణ కమిటీ చైర్మన్ పర్వాటకం లక్ష్మారెడ్డి, ఏఈవో గంగా శ్రీనివాస్, పర్యవేక్షకుడు నీల శేఖర్, ఆలయ ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, కమిటీ సభ్యులు, సిబ్బంది, అర్చకులు, ఒగ్గు పూజారులు భక్తులకు సేవలందించారు. అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి ఆధ్వర్యంలో హుస్నాబాద్ ఏసీపీ సతీశ్, చేర్యాల సీఐ శ్రీను, కొమురవెల్లి ఎస్సై నాగరాజు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



గంగరేగుచెట్టు వద్ద మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



పట్నం వేసి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



రాజగోపురం వద్ద భక్తులు